వినియోగదారుడు అవగాహన కలిగి ఉండాలి

బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ అధికారి ప్రభాకర్


నాగార్జున పాఠశాలలో అవగాహన కార్యక్రమం

రాయదుర్గం: వస్తువు నాణ్యత, భద్రత, విశ్వసనీయత అనే అంశాలపై ప్రతి వినియోగదారుడు అవగాహన కలిగి ఉండాలని బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ అధికారి (బీఐఎస్) ప్రభాకర్ సూచించారు. రాయదుర్గంలోని నాగార్జున ఉన్నత పాఠశాల ఆవరణలో విద్యార్థులు, టీచర్లు, తల్లిదండ్రులకు అవగాహన కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యాసంస్థలలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తే తమ తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తారనే నమ్మకంతో కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. వస్తువు కొనేప్పుడు వాటికి సంబంధించిన గుర్తులు, అగ్‌మార్క్ గుర్తులు, లైసెన్స్ వివరాలు, ఇతర అంశాలపై పూర్తి అవగాహనతో వాటిని గమనించి కొనుగోలు చేయాలని సూచించారు. ప్రస్తుతం ప్రతి వాటిలో కల్తీ, డూప్లికేట్ మార్కెట్‌లోకి వస్తున్నాయని వాటిని అరికట్టేందుకు ప్రభుత్వాలు చర్యలు తీసుకుంటున్నా, ప్రతి ఒక్కరు కూడా అవగాహన కలిగి ఉంటే విక్రయించడానికి జంకే పరిస్థితి వస్తుందన్నారు.ఈ సందర్భంగా నీళ్ళ బాటిల్‌ను చూపిస్తూ దాని నాణ్యతపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా నారాయణమ్మ ఇంజనీరింగ్ కళాశాల ప్రొఫెసర్ రాకేష్ మాట్లాడుతూ మనుష్యులు ఎలా ఉంటారో, నేటి రోబోలు ఎలా పనిచేస్తున్నాయో వాటి తేడాలను ఆయన వివరించారు. జీఐఎల్‌టీ ప్రొఫెసర్ అరుణకుమారి పలు అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులకు పలు రకాల పోటీలను నిర్వహించి వాటిలో గెలిచిన వారికి నగదు పురస్కారాలను అందించారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ భరత్‌కుమార్, ప్రిన్సిపల్ సుందరి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పారగాన్ పరిశ్రమ సేవలు ప్రశంసనీయం


ప్రభుత్వ పాఠశాలను ప్రారంభించిన ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

పటాన్‌చెరు: సామాజిక సేవలో పారగాన్ పరిశ్రమ సహకారం ప్రశంసనీయమని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. మంగళవారం పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని బండలగూడ మార్క్స్ కాలనీలో పారగాన్ పరిశ్రమ ఆర్థిక సహకారంతో ఒక కోటి 30 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించిన అంగన్‌వాడీ ,మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల భవనాలను ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. అత్యంత నిరుపేదలు నివసించే మార్క్స్ కాలనీలో కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా ఆధునిక సౌకర్యాలతో భవనాలు నిర్మించడం పట్ల పరిశ్రమ యాజమాన్యానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్ మెట్టుకుమార్ యాదవ్, మాజీ ఎంపీపీ యాదగిరి యాదవ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్‌కుమార్, బీఆర్ఎస్ పార్టీ డివిజన్ అధ్యక్షులు అఫ్జల్,మాజీ కార్పొరేటర్ అంజయ్య, పరిశ్రమ డైరెక్టర్ సిద్దార్థ్, ప్రతినిధులు బిను, శ్రీజిత్, పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

పేదలకు అండగా కాంగ్రెస్ పార్టీ


సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

పటాన్‌చెరు టౌన్: రాష్ట్రంలో పేదలకు అండగా నిలిచే ఏకైక పార్టీ కాంగ్రెస్ పార్టీ అని ఆ పార్టీ పట్టణ అధ్యక్షుడు నర్సింహారెడ్డి అన్నారు. మంగళవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్ల పథకం ప్రారంభించడంతో పేదలకు మంచి రోజులు వచ్చాయంటూ జీహెచ్ఎంసీ కార్యాలయం ముందు సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అనంతరం మిఠాయిలు పంచి సంబరాలు చేసుకున్నారు.ఈ సందర్భంగా నర్సింహారెడ్డి మాట్లాడుతూ... గడచిన తొమ్మిది సంవత్సరాలుగా పటాన్‌చెరు నియోజకవర్గంలో స్థానికులకు డబుల్ బెడ్‌రూమ్ ఇల్లు ఇవ్వకుండా మొండి చెయ్యి చూపారని ఆరోపించారు. ముఖ్యంగా పటాన్‌చెరు పట్టణంలో చాలా మంది పేదలు సొంతింటికి నోచుకోకపోవడం బాధాకరమన్నారు.కార్యక్రమంలో డీసీసీ కార్యదర్శి సమ్మయ్య, నాయకులు అతిక్, కుంచాల కిషన్, పాషా, ఆసిఫ్, జ్యోతి ,ప్రమీల ,రాణి, కళ, వెంకట్ రావు, హనుమంతు, సంతోష్ పాల్గొన్నారు.

భారతి సిమెంట్‌తో నిర్మాణాలు వేగవంతం


మాట్లాడుతున్న భారతి సిమెంట్ టెక్నికల్ ఇంజనీర్ సాత్విక్‌రెడ్డి

మియాపూర్: సిమెంట్ వ్యాపారంలో తిరుగులేని సంస్థగా ఎదుగుతున్న భారతి సిమెంట్ అల్ట్రాఫాస్ట్ పేరుతో ఫాస్ట్ సెట్టింగ్ సిమెంట్ 5స్టార్ గ్రేడ్‌ను తెలంగాణలో విడుదల చేసిందని ఆ సంస్థ టెక్నికల్ ఇంజనీర్ సాత్విక్‌రెడ్డి తెలిపారు. శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని మియాపూర్‌లో సాయిరాం సిమెంట్ ఏజెన్సీ డీలర్ షాప్‌లో తాపీ మేస్త్రీల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...మార్కెట్‌లో లభించే ఇతర సిమెంట్‌తో పోలిస్తే భారతి అల్ట్రాఫాస్ట్‌తో నిర్మాణం చాలా వేగవంతంగా పూర్తవుతుందని వివరించారు. అల్ట్రా ఫాస్ట్ సిమెంట్ ముఖ్యంగా స్లాబులు, పిల్లర్లు, బ్రిడ్జీలు మరియు రహదారులకు సరైన ఎంపిక అని పేర్కొన్నారు. అల్ట్రాఫాస్ట్ వినియోగదారులకు ఉచిత సాంకేతిక సహాయం అందజేస్తామని స్లాబ్ కాంక్రీట్ సమయంలో నిపుణులైన భారతి సిమెంట్ ఇంజనీర్లు సైట్ వద్దకే వచ్చి సహాయపడుతారని చెప్పారు. అనంతరం 50 మంది తాపీ మేస్త్రీలకు లక్ష రూపాయల ప్రమాద బీమా బాండ్లను అందజేశారు. కార్యక్రమంలో మార్కెటింగ్ ఆఫీసర్ అయ్యప్పరెడ్డి, టెక్నికల్ ఆఫీసర్ నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

గురునాథం చెరువులో గుర్రపుడెక్క తొలగింపు

మియాపూర్: సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని మియాపూర్ కార్పొరేటర్, స్టాండింగ్ కమిటీ సభ్యులు ఉప్పలపాటి శ్రీకాంత్ అన్నారు. మియాపూర్ డివిజన్ పరిధిలోని గురునాథం చెరువులో గుర్రపుడెక్క తొలగింపు పనులను జీహెచ్ఎంసీ ఎంటమాలజీ అధికారులతో కలిసి మంగళవారం కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గుర్రపుడెక్క తొలగింపు పనులను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. స్థానిక నాయకులు మహమ్మద్ జహంగీర్, మహ్మద్ మోసిన్, జీహెచ్ఎంసీ ఎంటమాలజీ అధికారి గణేష్ పాల్గొన్నారు.


పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ శ్రీకాంత్ తదితరులు

ఓటు.. భావితరాలకు తెలిసేట్లు..

- స్వీప్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు
- మాక్ పోలింగ్
- 52 పాఠశాలలు, 8 కాలేజీలలో కార్యక్రమాలు


ఓటు వేయడానికి బారులుదీరిన విద్యార్థులు (ఫైల్)

పటాన్‌చెరు టౌన్: భావి పౌరులకు ఎన్నికలపై అవగాహన కల్పించడానికి రాష్ట్ర ఎన్నికల కమిషన్ శ్రీకారం చుట్టింది. 14–17 ఏళ్ల లోపు విద్యార్థులకు ఎన్నికల ప్రక్రియపై చైతన్యం కలిగించడానికి స్వీప్ (సిస్టమెటిక్ ఓటర్స్ ఎడ్యుకేషన్ అండ్ ఎలక్టోరల్ పార్టిసిపేషన్ ప్రోగ్రాం) కార్యక్రమం చేపట్టారు. కలెక్టర్ ఆదేశాలతో విద్యాశాఖ ప్రత్యేక అధికారుల పర్యవేక్షణలో పాఠశాలలు ,ఇంటర్మీడియట్, డిగ్రీ కళాశాలలలో ఎలక్టోరల్ లిటరసీ క్లబ్ ఏర్పాటు చేశారు. ఓటు హక్కు, ప్రజా ప్రతినిధుల ఎన్నిక విధానం, ఎలక్షన్ నిర్వహణ, ఓట్ల లెక్కింపు, ఫలితాల ప్రకటన తదితర అంశాలను భవిష్యత్తు ఓటరు మరింత లోతుగా తెలుసుకోవడానికి ఈ క్లబ్ ఉపయోగపడతాయి. ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా, ఓటు హక్కును సద్వినియోగం చేసుకునేలా విద్యార్థి దశలో



చైతన్యం కల్పించడమే (ఈఎల్‌సీ)ల ప్రధాన ఉద్దేశం అంటూ స్వీప్ నోడల్ అధికారి జ్యోతిరెడ్డి, మాస్టర్ ట్రైనర్ అమరేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో నియోజకవర్గంలో పలు కార్యక్రమాలు అమలు చేస్తున్నారు.

52 పాఠశాలలు, 8 కళాశాలలో అవగాహన

పాఠశాలలో, ఇంటర్మీడియట్ కళాశాలతో పాటు మెడికల్ డిగ్రీ కళాశాలలో స్వీప్ కార్యక్రమాలు చేపట్టారు. ప్రస్తుతం ఐక్యరాజ్యసమితి, పోలింగ్, మోడల్ పోలింగ్‌స్టేషన్, ఎన్నికల అధికారులు బీఎల్‌ఓల గురించి వివరిస్తున్నారు. విద్యార్థులు ఓటర్లుగా ఎన్నుకునేలా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. తద్వారా ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు విలువ ,నమోదు, అడ్రస్ మార్పులు చేర్పులు ఎలా చేసుకోవాలో అవగాహన కల్పిస్తున్నారు.

మాక్ పోలింగ్ ద్వారా అవగాహన



స్వీప్ కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేస్తున్నాం. పటాన్‌చెరు నియోజకవర్గ పరిధిలోని పాఠశాలలు ,కళాశాలలో ఎన్నికల ప్రక్రియపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నాం. మాక్ పార్లమెంట్, ఓటింగ్ ప్రక్రియపై మాక్ పోలింగ్ నిర్వహించి విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నాం.

– స్వీప్ నోడల్ ఆఫీసర్, అమీన్‌పూర్ మున్సిపల్ కమిషనర్ జ్యోతిరెడ్డి

ఎన్నికల నిర్వహణ తెలిసింది

దేశంలో ఎన్నికల నిర్వహణ ఎలా జరుగుతుందో ప్రత్యక్షంగా తెలుసుకున్నాం. పోలింగ్ కేంద్రం నిర్వహణ, ఎన్నికల అధికారులు , సిబ్బంది విధులు, పార్లమెంట్ ఎన్నికల నిర్వహణ గురించి స్వీప్ అవగాహన కార్యక్రమం ద్వారా తెలుసుకున్నాం. మాక్ పోలింగ్‌లో ఓటు వేశాం.

– విద్యార్థి పూజ, 8వ తరగతి, ప్రభుత్వ పాఠశాల

సంకల్పపత్రాన్ని తీసుకున్నాం



పటాన్‌చెరు నియోజకవర్గ పరిధిలో 162 ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల తల్లిదండ్రుల నుండి సంకల్ప పత్రాన్ని తీసుకున్నాం.దానిలో ప్రతి ఒక్క విద్యార్థి తల్లిదండ్రులు పోలింగ్ రోజు ఓటింగ్ కు తప్పక హాజరవుతామని పేర్కొన్నారు.గతంలో కన్నా ఓటింగ్ శాతం పెరుగుతుందని ఆశిస్తున్నాం.

– మాస్టర్ ట్రైనర్ అమరేందర్‌రెడ్డి

నిఫ్ట్‌లో క్రాఫ్ట్ మేళా -2024

ఈనెల 14 నుంచి 16వ తేదీ వరకు

మాదాపూర్: మాదాపూర్‌లోని నిఫ్ట్‌లో మూడు రోజుల పాటు క్రాఫ్ట్ బజార్‌ను నిర్వహించనున్నారు. హస్త కళాకారులకు పట్టణ మార్కెట్లపై అవగాహన కల్పించడమే కాకుండా విద్యార్థులకు చేనేత వృత్తిపై అవగాహన కల్పించనున్నారు. ఉదయం 11గంటల నుంచి రాత్రి 7గంటల వరకు అందుబాటులో ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. భారతదేశంలోని వివిధ క్రాఫ్ట్ క్లస్టర్‌ల నుంచి దాదాపు 45 మంది హస్తకళాకారులు పాల్గొనున్నారు.

అరుదైన శస్త్ర చికిత్స


శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి నల్లగండ్లలోని సిటిజన్ స్పెషాలిటీ హాస్పిటల్‌లో 35 ఏళ్ళ వ్యక్తికి మల్టీ డిసిప్లినరీ విధానంలో చికిత్స చేసి వైద్యులు కాపాడారు. ఓ వ్యక్తి ఛాతీ నొప్పితో హాస్పిటల్‌లో చేరగా స్టంట్ వేశారు. అనంతరం అతను కుడి భుజం, మెడనొప్పితో బాధపడుతూ హాస్పిటల్‌కు రాగా న్యూరో కన్సల్టేషన్‌లో కుడి పారా సెంట్రల్ ప్రోలాప్స్ కారణంగా నరాలు ఒత్తిడికి గురైనట్లు నిర్ధారించి చికిత్స చేశారు. ఈ మేరకు న్యూరో సర్జన్ డాక్టర్ రాజేష్‌రెడ్డి , హాస్పిటల్ ఆర్‌సీఓఓ డాక్టర్ ప్రభాకర్ మంగళవారం వివరాలను వెల్లడించారు.

ఎమ్మెల్యేను కలిసిన నూతన కార్యవర్గం



ఆల్విన్‌కాలనీ: కూకట్‌పల్లి డివిజన్ ఆస్‌బెస్టాస్ హిల్స్ కాలనీ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు మంగళవారం శేరిలింగంపల్లి ఎమ్మెల్యే గాంధీని మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాలనీ అభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలు ఎల్లవేళలా ఉంటాయన్నారు. కార్యక్రమంలో బీఆర్‌యస్ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, కాలనీ ప్రెసిడెంట్ నరేష్, వైస్ ప్రెసిడెంట్ నర్సింహులు, జనరల్ సెక్రటరి మహ్మద్ హుస్సేన్, జాయింట్ సెక్రటరి మహమ్మద్ రఫిక్, ట్రెజరర్ పుష్ప పాల్గొన్నారు.

ప్రమాదకరంగా..


కృషినగర్ ప్రధానరోడ్డులో పాడైన మ్యాన్‌హోల్

మియాపూర్: అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించకపోవడంతో వేసిన కొద్దిరోజులకే పాడవుతున్నాయి. మియాపూర్ కృషినగర్ ప్రధానరోడ్డులో మ్యాన్‌హోల్ ధ్వంసమై ప్రమాదకరంగా మారింది. గత వారం రోజుల కిందట మరమ్మతులు చేసి కొత్త మ్యాన్‌హోల్ మూతలను ఏర్పాటు చేశారు. వారం రోజులు కాకముందే పగిలిపోయింది. ఏ ప్రమాదం చోటుచేసుకుంటుందోనని ప్రజలు భయపడుతున్నారు. అధికారుల పర్యవేక్షణ లేకపోవడం వల్లే ఈ పరిస్థితి నెలకొందని స్థానిక నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

గ్రాండ్ క్వీన్స్ లీడర్ షిప్ అవార్డ్స్-2024

48 మంది మహిళలకు సత్కారం



గచ్చిబౌలి: వివిధ రంగాలలో పని చేస్తున్న మహిళలకు గ్రాండ్ క్వీన్స్ లీడర్ షిప్ అవార్డ్స్ అందజేశారు. మంగళవారం గచ్చిబౌలిలోని క్లబ్ బొటానికాలో లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ జిల్లా 320ఏ ఆధ్వర్యంలో గ్రాండ్ క్వీన్స్ లీడర్ షిప్ అవార్డుల కన్వీనర్ సౌరబ్ సురేఖ, సహ వ్యవస్థాపకురాలు రూపా రేఖ మాట్లాడుతూ 108 రంగాలలో పని చేస్తున్న మహిళల నుంచి నామినేషన్లు ఆహ్వానించామని తెలిపారు. త్వరలో దేశం మొత్తం పర్యటిస్తామని కోల్‌కతా, భువనేశ్వర్, అజ్మీర్‌లలో ఆడిషన్లు జరగనున్నాయని చెప్పారు. 15 మంది గ్రాండ్ క్వీన్స్ చేనేత చీరలు ధరించి ర్యాంప్ వాక్ చేశారని ఈ శారీ వాక్‌కు డైరెక్టర్ శ్రీకాంత్ గతాల కొరియోగ్రాఫర్‌గా వ్యవహరించారని వివరించారు. 200 మందికి పైగా పోటీ పడగా 'క్వీన్ ఆఫ్ గ్రాండ్ క్వీన్స్' కోసం అనికా ఖరా, ఛాయ శర్మ, కృతిక శర్మ, ప్రవీణ్ నాయుడు, డాక్టర్ సుధా జైన్, శిప్రా గాంధీ, డాక్టర్ తులసి కేబీ, పల్లవి వాలియా రాజ్, టినీ సిక్వేరా తదితరులు పోటీ పడ్డారు. 48 మంది మహిళలకు అవార్డులు అందజేశారు. కార్యక్రమంలో లయన్ హరి నారాయణ్ భట్టాడ్, జిల్లా గవర్నర్ లయన్స్ డిస్ట్రిక్ట్ 320ఏ, లయన్ సీఏ ఎంకె పురోహిత్, డాక్టర్ ప్రీతి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి నుంచి ప్రేరణ పొందండి

భౌతికశాస్త్ర ఆచార్యుడు ప్రొ.బీవీఆర్ టాటా


మాట్లాడుతున్న ప్రొ.బీవీఆర్ టాటా

పటాన్‌చెరు టౌన్: ఏ పరిశోధనకైనా ప్రకృతే మూలమని, దాని నుంచి ప్రేరణ పొంది, ప్రయోగశాలలో ఆచరణాత్మకంగా రుజువు చేయాలని భౌతికశాస్త్ర విశిష్ట ఆచార్యుడు ప్రొఫెసర్ బీవీఆర్ టాటా సూచించారు. గీతం స్కూల్ ఆఫ్ సైన్స్‌లోని భౌతిక శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో 'ఫొటోనిక్ స్ఫటికాల నమూనాల ఘర్షణ: భౌతికశాస్త్రం, సెన్సింగ్ అప్లికేషన్స్ అనే అంశంపై మంగళవారం ఆయన అతిథ్య ఉపన్యాసం చేశారు. కొల్లాయిడల్ క్రిస్టల్ టెంప్లేట్లు మూడు కోణాలలో నానోమీటర్ నుంచి సబ్ మైక్రోమీటర్ లక్షణాలతో ఆవర్తనాలను నిర్మించడానికి బహుముఖ సింథటిక్ సాంకేతికగా మారుతుందన్నారు.ఈ సాంకేతికత విభిన్న పరిమాణాలు, స్వరూపాలు, కూర్పులతో పోరస్ పదార్థాల సంశ్లేషణను అనుమతించడమే గాక, వివిధ సెన్సింగ్ అప్లికేషన్లకు దారి తీస్తుందని చెప్పారు.ఇది భవిష్యత్తులో మరింత ప్రత్యేకమైన పదార్థాలు, అప్లికేషన్ల అభివృద్ధికి బాటలు వేస్తుందని చెప్పారు. కార్యక్రమంలో భౌతికశాస్త్ర విభాగాధిపతి ప్రొఫెసర్ విశ్వం, అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కు అందజేత


ఎల్‌ఓసీ పత్రాలను అందజేసిన ఎమ్మెల్యే గాంధీ

భాగ్యనగర్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని శంషీగూడ, ఇందిరాహిల్స్ కాలనీకి చెందిన జోగిపేట రవీందర్‌కు అత్యవసర వైద్య చికిత్స నిమిత్తం ముఖ్యమంత్రి సహాయనిధికి దరఖాస్తు చేసుకోగా మంజూరైన 90 వేల రూపాయల ఎల్‌ఓసి పత్రాన్ని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్‌తో కలిసి మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ ప్రజాక్షేమమే లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం కృషి చేస్తుందని పునరుద్ఘాటించారు. కార్యక్రమంలో మాదాపూర్ డివిజన్ బీఆర్‌యస్ పార్టీ అధ్యక్షుడు ఎర్రగుడ్ల శ్రీనివాస్ యాదవ్, మాదాపూర్ డివిజన్ బీఆర్‌యస్ పార్టీ గౌరవ అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్, బీఆర్‌యస్ పార్టీ నాయకులు మారబోయిన రవీందర్ యాదవ్, బిక్షపతి ముదిరాజ్, కాశీనాద్ యాదవ్, ఎండి ఇబ్రహీం, మామిడాల రాజు, రాజన్న తదితరులు పాల్గొన్నారు.

అంతర్ కళాశాలల సాంస్కృతిక పోటీలు


బుర్ర కథ చెబుతున్న విద్యార్థులు


నృత్యం చేస్తున్న విద్యార్థిని


ఏజీవర్సిటీ: ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో అంతర్ కళాశాలల సాంస్కృతిక, సాహిత్య పోటీలు ఉత్సాహంగా సాగుతున్నాయి. ఈ పోటీలలో 11 కళాశాలలకు చెందిన 205 మంది విద్యార్థులు పాల్గొన్నారు. రేపటిలో ఈ పోటీలు ముగియనున్నాయి.

బీజేపీలో చేరికలు



హఫీజ్‌పేట్: చందానగర్‌కు చెందిన శ్రీకృష్ణ భక్తురాలు వి.అనురాధ, వివిధ పార్టీలకు చెందిన నాయకులు బీజేపీ రాష్ట్ర నాయకులు కసిరెడ్డి భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోడీ చేస్తున్న అభివృద్ధి చూసి పార్టీలో చేరుతున్నారన్నారు. బీజేపీ బలోపేతానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని కోరారు. అనంతరం అనురాధ మాట్లాడుతూ మోడీ ద్వారానే సనాతన ధర్మం కాపాడబడుతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు బొక్క బాల్‌రెడ్డి, గూడూరి త్రినాథ్, నందనం వినయ, పార్వతి తదితరులు పాల్గొన్నారు.

చిల్డ్రన్స్ పార్కు ప్రారంభం



శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి డివిజన్ ఆరంభ టౌన్‌షిప్‌లో ఏర్పాటు చేసిన చిల్డ్రన్స్ పార్కును కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ మంగళవారం ప్రారంభించారు. కార్యక్రమంలో ఆరంభ టౌన్‌షిప్ అసోసియేషన్ అధ్యక్షులు రవీంద్ర రాథోడ్, నాయకులు మధుసూదన్‌రెడ్డి, భిక్షపతి, రెహానా బేగం, రాజేష్, సరిత, గోపాల్ యాదవ్, రవియాదవ్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే లక్ష్యం

జిన్నారం(పటాన్‌చెరు): గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అన్నారు. జిన్నారం మండలంలోని వావిలాల, అండూర్, జంగంపేట గ్రామాల్లో రూ.76 లక్షలతో నిర్మించనున్న కల్వర్టు పనులకు మంగళవారం ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. అనంతరం లక్ష్మీపతి గూడెంలో నూతనంగా నిర్మించిన హనుమాన్ ఆలయంలో పూజలు చేశారు. కార్యక్రమంలో జెడ్పీవైస్ చైర్మన్ ప్రభాకర్, ఎంపీపీ రవీందర్‌గౌడ్, పార్టీ నాయకులు గ్రామాల ప్రజాప్రతినిధులు, పాల్గొన్నారు.

ఎర్రకుంట చెరువు సర్వే


బాచుపల్లిలోని ఎర్రకుంట చెరువును సందర్శించిన రెవెన్యూ అధికారులు

నిజాంపేట్: నిజాంపేట్ కార్పొరేషన్ పరిధి బాచుపల్లిలో మంగళవారం రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు ఎర్రకుంట చెరువు సర్వే చేపట్టారు. నిజాంపేట్ కార్పొరేషన్ బీజేపీ అధ్యక్షుడు ఆకుల సతీష్ పలు చెరువుల ఆక్రమణలపై ఫిర్యాదు చేయడంతో ఎట్టకేలకు అధికారులు స్పందించారు. ఈ సందర్భంగా రెవెన్యూ డీఐ గంగాధర్ మాట్లాడుతూ చెరువు సర్వే అనంతరం హద్దు రాళ్లను ఏర్పాటు చేస్తామని, ఎఫ్‌టిఎల్ పరిధిలో ఏమైనా నిర్మాణాలు జరిగితే వాటిని మార్కింగ్ చేస్తామని తెలిపారు. మండల సర్వేయర్ సదానంద్, ఆర్ఐ కవిత, ఇరిగేషన్ శాఖ డిప్యూటీ ఇంజనీర్ శ్రీనివాస్, బీజేపీ నాయకులు ఉన్నారు.

ఘనంగా రేణుక ఎల్లమ్మ జాతర

పటాన్‌చెరు: జాతరలు తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలకు ప్రతీకలని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. పటాన్‌చెరు మండలంలోని పోచారంలో మంగళవారం నిర్వహించిన రేణుక ఎల్లమ్మ తల్లి జాతర మహోత్సవంలో ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ శంకర్ యాదవ్, సీనియర్ నాయకులు కోడూరి బిక్షపతి, తలారి బిక్షపతి, శ్రీశైలంగౌడ్, గౌడ సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

బీఎల్ఎఫ్ నియోజకవర్గ స్థాయి సమావేశం

మియాపూర్: పార్లమెంట్ ఎన్నికలలో బీజేపీని ప్రజలు తిరస్కరించాలని బీఎల్ఎఫ్ రాష్ట్ర చైర్మన్ నల్ల సూర్యప్రకాష్ అన్నారు. మియాపూర్ ఎంఏనగర్‌లో బహుజన లెఫ్ట్ ఫ్రంట్ ఆధ్వర్యంలో చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గ స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ... బీజేపీ అధికారంలోకి వచ్చిన పది సంవత్సరాలలో ఆర్ఎస్ఎస్, భజరంగ్ దళ్ లాంటి మత సంస్థల జెండాలను అమలు పరుస్తూ భారత రాజ్యాంగాన్ని నిర్వీర్యం చేసే చర్యలు తీసుకున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో బీఎల్ఎఫ్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బస్సు అద్దాలు పగలగొట్టిన ఇద్దరిపై కేసు నమోదు

మియాపూర్: బస్సు డ్రైవర్‌ను దుర్భాషలాడడంతో పాటు బస్సు అద్దాలు పగలగొట్టిన ఇద్దరు వ్యక్తులపై మియాపూర్ పోలీసుల కేసు నమోదు చేశారు. ఎస్ఐ జగదీశ్వర్ తెలిపిన వివరాల ప్రకారం ... చెంగిచెర్ల డిపోకు చెందిన బస్సు సోమవారం రాత్రి సికింద్రాబాద్ నుంచి పటాన్‌చెరుకు వెళ్తూ మియాపూర్ మెట్రో స్టేషన్ వద్ద ప్రయాణికుల కోసం ఆగింది. ఈ క్రమంలో సాయితేజ, ఎం. రాజులు ఇద్దరు బస్సు డ్రైవర్ రామచంద్రుపై గొడవ పడ్డారు. అతనిపై దుర్భాషలాడి బస్సు అద్దం పగులగొట్టారు. దీంతో డ్రైవర్ రామచంద్రు మియాపూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు పరిశీలించి సాయితేజ, రాజులపై కేసు నమోదు చేసినట్టు తెలిపారు.

స్కూటీని ఢీకొట్టిన టిప్పర్

యువకుడు మృతి..

పటాన్‌చెరు టౌన్: స్కూటీని టిప్పర్ ఢీకొట్టిన ఘటనలో తీవ్ర గాయాలపాలైన యువకుడు అక్కడికక్కడే మృతి చెందగా,మరో యువకున్ని చికిత్స కోసం పటాన్‌చెరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించిన సంఘటన బీడీఎల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. హెడ్ కానిస్టేబుల్ పాషా కథనం ప్రకారం.. గచ్చిబౌలికి చెందిన నీరుడి సందీప్ సాగర్(25)(డెలివరీ బాయ్) అతడి స్నేహితుడు మణి ఇరువురు కలిసి స్కూటీపై రామచంద్రాపురం మండలం సందిగూడెం వైపు నుండి నాగులపల్లి 100 ఫీట్ రోడ్‌లో వస్తుండగా కొల్లూరు ఓఆర్ఆర్ సమీపంలో ఎదురుగా వస్తున్న టిప్పర్ లారీ స్కూటీని ఢీ కొట్టింది. ఈ ఘటనలో నీరుడి సందీప్ సాగర్‌కు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. అతని స్నేహితుడు మణికి గాయాలు కావడంతో చికిత్స కోసం పటాన్‌చెరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం పటాన్‌చెరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.మృతుడి తల్లి వసంత ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.